క్లుప్తంగా

24న ఉచిత ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో ఈ నెల 24న ఉచిత ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వర రావు ఆదివారం తెలిపారు. నిర్వాహకులు వాసు దాచేపల్లి పద్మ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ శిబిరానికి బ్రహ్మర్షి తటపర్తి వీరరాఘవ రావు హాజరై ధ్యానం, శ్వాస మీద ధ్యాస, ధ్యానం చేసే విధానం, ధ్యానం ప్రతినిత్యం క్రమం తప్పకుండా చేయడంతో కలిగే ప్రయోజనాలు వివరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన పల్లపు గోపాల్ రావు తన తల్లిదండ్రులైన వెంకటేశ్వరు, సావిత్రమ్మ జ్ఞాపకార్థంగా రూ.20 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండ వెంకటసత్యనారాయణగుప్త, కోశాధికారి వందనపు సూర్యప్రకాశరావు, భోనగిరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణంలో బీజేపీ మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్ల ప్రభుత్వ పాలనపై, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ నాయకులు నారపురెడ్డి, సోమయ్య, కోటిరెడ్డి, లక్ష్మణ్, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : అమెరికా పర్యటన ముగించుకొని సూర్యాపేటకు వచ్చిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని ఆదివారం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, నాయకులు బెల్లంకొండ అమర్‌గౌడ్, వీరమల్ల సుందరయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుల ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఇరువురు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లేపల్లి వెంకటేశ్వర్లు పట్టణానికి చెందిన కోలా నాగేశ్వరరావు, ధూళిపాల శ్రీనివాసరావుకు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్నూరు కాపు సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను తిప్పికొట్టేందుకు జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చే యాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులతో సమ్మె బుక్‌లెట్‌ను విడుదల చేసి మా ట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తేవడం వల్ల కా ర్మిక హక్కులకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మారుస్తోందన్నారు. సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంజిరాల సరస్వతి, శ్రావణి, సిల్వేరు లక్ష్మి, శోభ, వనిజ, రాణి, బుచ్చమ్మ, సత్యం, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన లింక్‌రోడ్డుతో అవస్థలు

- మరమ్మతులకు నోచుకోని జెర్రిపోతులగూడెం – కొత్త కట్టవారిగూడెం రోడ్డు
- కంపచెట్లు, గుంతలతో ఇబ్బందులు పడుతున్న రైతులు

చిలుకూరు : మండలంలో ఆయా గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం నుంచి హుజూర్‌నగర్ మండలం కొత్త కట్టవారిగూడెం వరకు 7కిలోమీటర మేర ఉంటుంది. ఈ రోడ్డు కంపచెట్లతో మూసుకుపోయి, గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డు అత్యంత అధ్వానంగా తయారై ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమణలకు గురికావడంతో రోడ్డు వెడల్పు చిన్నగా మారింది. ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే కనీసం పక్కకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఎదురుగా రైతులకు సంబంధించిన రెండు ట్రాక్టర్లు వస్తే పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు. రోడ్డు మొత్తం కంకర తేలి, కంపచెట్లతో నిండుకొని పోయింది. కట్టవారిగూడెం రోడ్డు హుజూర్‌నగర్ మండలానికి కలుపుతూ కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిని కలుపుతుంది.



కంపచెట్లతో మూసుకుపోయిన జెర్రిపోతులగూడెం - కొత్త కట్టవారిగూడెం రోడ్డు ఇబ్బందులు పడుతున్న రైతులు..

ఈ రోడ్డులో చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం, హుజూర్‌నగర్ మండలం కొత్త, పాత కట్టవారిగూడెం, రాయినిగూడెం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉంటాయి. నిత్యం ఈ రోడ్డులో వందల మంది రైతులు తమ పొలాలకు వెళ్తుంటారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా మారడంతో రైతులు తమ పొలాలకు ద్విచక్రవాహనాలపై మందు కట్టలు, పశువులకు గడ్డిమోపులు తీసుకొని వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వరినాట్లు, వరికోతల సమయంలో ట్రాక్టర్లు, వరికోత మిషన్లు ఈ రోడ్డులో వెళ్లాలంటే మరింత ఇబ్బంది ఉందని రైతులు అంటున్నారు. ఈ రోడ్డు పొడవునా పొలాలే ఉండడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలి



జెర్రిపోతులగూడెం నుంచి కట్టవారిగూడెం వెళ్లే రోడ్డు మొత్తం కంకర తేలి అధ్వానంగా ఉంది. 15ఏళ్ల క్రితం మెటల్ రోడ్డు వేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ రోడ్డును పట్టించుకున్న వారే లేరు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు అధికారులకు, నాయకులకు చెప్పినా ప్రయోజనం లేదు. తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– రెమిడాల రాజు, జెర్రిపోతులగూడెం

మరమ్మతుల కోసం పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదని రైతులు అంటున్నారు. ప్రజాప్రతినిధులను, నాయకులను అడిగితే ఈ రోడ్డుకు అంచనాలు వేశాము, రోడ్డు మరమ్మతులు చేస్తామని చెప్పడమే కాని నేటి వరకు పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బీటీరోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

చిలుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్ అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం పరిధిలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు కట్టేకోల వెంకన్న, రవినాయక్, కాశయ్య, నాగచారీ, కొడారు రాము, మీసాల మట్టయ్య, అనిల్, కొండా శ్రీను, పాండు నాయక్, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లింగస్వామి, ధనమూర్తి, వెంకన్న, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

హుజూర్‌నగర్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు జి.సైదులుయాదవ్, షేక్ హసన్‌మియా అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి వార్డుల వారీగా పార్టీ సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. ఎన్నికల్లో పోటీకి నాయకులు, కార్యకర్తలు అందరూ సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుణగంటి నాగరాజు, బండారు మహేష్, కొత్తపల్లి శ్రీను, తోట ఆకాష్, ధనుంజయ్, దూలిపాల ఉదయ్, గుండా సతీష్, తమ్మిశెట్టి నరసింహారావు, అల్లవుద్దిన్, నాగరాజు, పుష్ప రాజ్, అదిత్య, కొట్టు రాజేష్, నరసింహారావు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

కంకర పరిచారు.. బీటీ మరిచారు



వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తున్న బేతవోలు డబుల్ లేన్ రోడ్డు

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు డబుల్ లైన్ రోడ్డు విస్తరణ పనులు గత కొన్ని నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డులో మట్టి పనులు మొత్తం పూర్తై కంకర పరిచి కూడా నెలలు గడుస్తున్నా నేటి వరకు బీటీ వేయలేదు. మొత్తం 8కిలోమీటర్ల మేర ఉన్న ఈరోడ్డులో 8కిలోమీటర్ల వరకు మెటల్ వేసిన తర్వాతనే బీటీ వేయాలని చూస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డుపై వాహనాలు వెళ్లేటప్పుడు కంకరరాళ్లు వచ్చి తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అంతేకాక కంకరరోడ్డుపై నీళ్లు చల్లకపోవడంతో రోడ్డుపై వెళ్లే వాహనాల దుమ్ముతో వెనుక ప్రయాణించే వాహనదారులకు రోడ్డు కనపడక ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా రోడ్డు సగం వరకు బీటీ వేసి అనంతరం మిగిలిన రోడ్డును రెండు విడతల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కాని కాంట్రాక్టర్ మాత్రం వాహనదారుల ఇబ్బందులు పట్టించుకోకుండా ఒకే సారి పూర్తి చేయాలని, ఇష్టానుసారంగా రోడ్డు వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెటల్ వేసిన వరకు బీటీ వేయాలని, ప్రతి రోజు మెటల్ రోడ్డుకు నీళ్లుచల్లించాలని వాహనదారులు కోరుతున్నారు.

అసంపూర్తిగా సీసీరోడ్డు నిర్మాణం

మునగాల : మండల కేంద్రంలోని కొక్కిరేణి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన సీసీరోడ్డు నిర్మాణంతో ఆ రోడ్డులో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ అన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆయన ఆదివారం అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై నిల్చుని నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మండల కేంద్రంలో సుమారు 800మీటర్ల పొడవు సీసీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మూడు నెలల క్రితం రూ.10కోట్లు మంజూరు చేసిందని, ఈ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ సుమారు 50మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదలేశాడని, దీంతో ఆదర్శ పాఠశాల విద్యార్థులు, పది గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా 800మీటర్ల సీసీరోడ్డుకు ఇరుపక్కలా సైడ్ బర్మ్ పోయకుండా వదలి వేశాడని ఆరోపించారు. తక్షణమే అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేసి రోడ్డుకు ఇరుపక్కలా మార్జిన్‌పై మట్టిపోయాలని, లేకుంటే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు దేవరం శ్యాంసుందర్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు బెల్టులు అందజేస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : మన దేశంలో పుట్టి ఇతర దేశాల్లో అభివృద్ధి చెందిన మార్షల్ ఆర్ట్స్ కరాటేను మనదేశంలో కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్ బేబీమూన్ ఉన్నత పాఠశాలలో సుమన్ షోటో ఖాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ జే.వీ.రమణ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని, పట్టణంలోని ప్రతి సెంటర్‌లో కరాటే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి కరాటే విద్యను నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కరాటేతో యువత మద్యపానం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల బారిన పడకుండా దృష్టిని మరల్చవచ్చని తెలిపారు. అనంతరం కరాటే విద్యార్థిని విద్యార్థులకు ఎల్లో బెల్టులు 30, గ్రీన్ బెల్టులు 20, ఆరెంజ్ బెల్ట్ 10, బ్రౌన్ 1, బ్లాక్ 1తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ షఫీ ఉల్లా, కరాటే మాస్టర్లు జేవీ రమణ, సంతోష్, సాయి కిరణ్, రిషి, చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పెన్‌పహాడ్ : మండల పరిధి లోని సూర్యానాయక్‌తండా (సూర్జహాన్‌పేట) గ్రామంలో బొడ్రాయి ఐదవ వార్షికో త్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత

సూర్యాపేట : మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు 45వ వార్డు మాజీ కౌన్సిలర్ పావనికృపాకర్ ఆదివారంపట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి రూ.10,500 విలువ గల ఇంటర్ సెకండ్ ఇయర్ పుస్తకాలను కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణానికి చెందిన ఎండీ అలీ కుమార్తె ఆసియా నజీమా సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుందని, ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిందని తెలిపారు.



పుస్తకాలు అందజేస్తున్న పావనికృపాకర్

మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత

కోదాడరూరల్ : మాదకద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కోదాడ పట్టణ ఎస్ఐ బొలిశెట్టి సుధీర్ అన్నారు. ఈ నెల 26 మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత గంజాయి వంటి డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలన్నారు. డ్రగ్స్ దూరమైతే ఆర్థికంగా చితికిపోవడంతో పాటు అనారోగ్యాల పాలై జీవితం నాశనం అవుతుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది, పట్టణ ప్రజలు ఉన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మునగాల : యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన యువత తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని వాపోయారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై దృష్టిసారించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలన్నారు.

మేళ్లచెరువు : యువత మాదకద్రవ్యాల బారిననపడొద్దని ఎస్ఐ పరమేష్ అన్నారు. ఆదివారం మండలంలో వేపలమాధవరం గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ నివారణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



నేరేడుచర్ల : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

నేరేడుచర్ల : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ డ్రైవర్లు, కూలీలకు మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలు వినియోగించడంతో నాడి వ్యవస్థ పూర్తిగా క్షీణిస్తుందన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయించినా, వినియోగించిన వారి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఎన్నిక

మునగాల : మండలంలోని మాధవరంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాత కొట్ల నాగరాజు, మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య ఆధ్వర్యంలో నూతన గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కొత్తపల్లి మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కత్తి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా చిటికెల నాగేంద్రబాబు, కార్యదర్శిగా పోకల వెంకన్న, కోశాధికారిగా వల్లపుదాసు చంటి, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి కృష్ణయ్యను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి మండల అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామగ్రామాన నూతన కమిటీలను ఏర్పాటు చేసి జూలై 7న నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాత కొట్ల నాగరాజు, ఎంఎస్‌పీ మండల శాఖ అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను, నాయకులు అరుణ్, రాకేష్, రామ్‌చరణ్, రాధాకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న కనకయ్య



నేరేడుచర్ల : ఎన్నికైన యూత్ కమిటీ ప్రతినిధులు

ఎమ్మార్పీఎస్ గ్రామ యూత్ కమిటీ ఎన్నిక

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ యూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ యూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని యూత్ మండల ఇన్‌చార్జ్ బచ్చలకూరి ప్రసాద్, యూత్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్‌కుమార్ ప్రకటించారు. యూత్ కమిటీ గ్రామ అధ్యక్షుడిగా పెద్దపంగ సూర్య, ఉపాధ్యక్షులుగా వాడపల్లి గౌతం, పెద్దపంగ దిలీప్, ప్రధాన కార్యదర్శిగా నందిపాటి సిద్ధు, కార్యదర్శిగా దోరేపల్లి ప్రీతం, భార్గవ్, అధికార ప్రతినిధిగా శోభన్, సహాయ కార్యదర్శులుగా పృథ్వీ, వాడపల్లి స్టాలిన్, కారర్యవర్గ సభ్యులుగా మచ్చ చరణ్, ఆకారపు సంతోష్, భరత్, సంపత్, మధు, సన్నీ, కార్తీక్, ప్రవీణ్, దేవా, చరణ్, అర్జున్, తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఆత్మకూర్(ఎస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అలుగుబెల్లి వెంకట నరసయ్య స్థూపం ఆవిష్కరణ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అలుగుబెల్లి వెంకట నరసయ్య స్థూపం ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జూలై 3న తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అలుగువెల్లి వెంకట నరసయ్య స్థూపంతోపాటు అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, కంచర్ల నర్సమ్మ, వీరయ్య, అంజయ్య, రాములు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : సూర్యాపేట నుంచి అర్వపల్లి, తిరుమలగిరి మీదుగా హైదారాబాద్‌కు నడిపిస్తున్న ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రికల్ బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ జి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బాణోతు సైదులు కోరారు. సూర్యాపేట–జనగామ రూట్లో నడుస్తున్న ఎలక్ట్రికల్ బస్సులను ఆదివారం అర్వపల్లిలో పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఈ రూట్లో 5 బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. వీటిని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

- తొమ్మిదేళ్లుగా అనంతగిరి మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే
- ఏ ఒక్క కార్యాలయానికి లేని సొంత భవనం
- ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజలు

కోదాడరూరల్ : గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత నూతన నిర్మించకపోవడంతో అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు నిర్వహించబడుతున్నాయి. కోదాడ నియోజకవర్గంలో ఉమ్మడి కోదాడ మండలంలోని అనంతగిరిని మండల కేంద్రంగా తొమ్మిదేళ్ల కిందట నాటి ప్రభుత్వం ప్రకటించింది. నాడు కోదాడ మండలంలోని 13గ్రామాలతో పాటు నడిగూడెం మండలంలోని 5గ్రామాలను కలుపుతూ నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే నూతన మండలాల ఏర్పాటుతో ప్రజలకు దూరభారం తగ్గి పాలన దగ్గరవుతుందని భావించారు, కానీ ఆ మండలాల్లో అందుకు తగిన విధంగా వసతులు ఏర్పాటు చేయకపోవడంతో మండల అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లోనే..

అనంతగిరి మండలంలో దాదాపు అన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం జెడ్పీ ఉన్నత పాఠశాలకు కోసం నిర్మించిన భవనంలో, మండల పరిషత్ కార్యాలయం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేయగా అధికారులు అక్కడి నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక పోలీస్ స్టేషన్, వ్యవసాయ కార్యాలయం, ఐకేపీ వంటి కార్యాలయాన్ని అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాలన్ని అరకొర వసతులతో ఉండడంతో అటు విధులకు హాజరవుతున్న అధికారులు, సిబ్బందికి ఇటు పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే సమావేశాలకు సరైన స్థలం లేకపోవడంతో దగ్గరలోని రైతు వేదికలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. తహసీల్దార్ కార్యాలయం పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. 50ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాల పాత భవనంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఆభవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ పాఠశాలలో అనుకొని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసినా..

మండలంలో ప్రధానంగా కావాల్సిన తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్‌ల నూతన భవన నిర్మాణ పనులకు గత ఏడాది జూలైలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఆ పనులకు శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా నేటి ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అనంతగిరి మండలంలో ప్రజలకు నిత్యం అవసరమయ్యే ప్రభుత్వ భవనాలను త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్



పాఠశాల భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నూతన భవనాలు నిర్మించాలి



అనంతగిరి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాలి. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించాలి.

– బద్దం కృష్ణారెడ్డి, శాంతినగర్ మాజీ సర్పంచ్